కథ

# పదిలంగా అల్లుకున్న గూడు

మంథా భానుమతి

కళ్ళుతెరవగానే అలవాటుగా కిటికీలోంచి చూశాడు రాజు. పలుచగా పరుచుకున్న చెట్టు కొమ్మల్లోంచి, రోజూకంటే ఆప్యాయంగా సూర్యుడు శుభోదయం చెప్తున్నాడు.

ఆ ప్రభాత వేళల్లో దినకరుడ్ని చూస్తుంటే గుండె కొంచెం తియ్యగా, కొంచెం బాధగా మూలిగింది. అసూయగా అనిపించింది. తన వాళ్ళందర్నీ వేరే కిటికీలోంచి రోజూ చూస్తున్నాడు కదా! టైమ్ చూశాడు.. ఏడున్నర.. వాళ్ళుండే చోట ఎప్పుడో తెల్లారి పోయుంటుంది... అంటే తప్పకుండా వాళ్ళని పలుకరించే ఉంటాడు.

బద్ధకంగా పక్కకి తిరిగి బాల భానుడ్నే చూస్తూ ఉండిపోయాడు.

ఇంకెంత.. రెండురోజుల్లో వాళ్ళని కలవబోతున్నాడు.

'రేపు కాదుకానీ.. ఎల్లుండి పొద్దున్నే, ఇప్పటికంటే.. ఇంకా చాలాముందే.. చిట్టిగాడు మెడమీద వేళ్ళాడుతుంటే.. బుజ్జి ఒళ్ళో కూర్చుని, నా మొహంలోకి చూస్తూ కబుర్లు చెప్తుంటే.. నా స్వంత ఇంట్లోంచి, కమ్మటి ఫిల్టర్ కాఫీ తాగుతూ నిన్ను పలుకరిస్తా.' అలాగా అన్నట్లు చూస్తూ ఎరుపు రంగు వదిలేసి.. పసుపుపచ్చని రంగులోకి మారిపోయాడు దివాకరుడు.. రాజుని ఉత్సాహపరుస్తూ!

ఒక్క సారిగా పది తేనె పిచ్చుకలు తుప్పల మధ్యలో ఉన్న దిగుడుబావిలోంచి చప్పుడు చేసుకుంటూ లేచి, అతివేగంగా ఆకాశంలోకి ఎగిరాయి.


రాజు వాటికి టాటా చెప్పి మంచం మీంచి లేచి ఒళ్ళు విరుచుకున్నాడు. తనుకూడా ఆ పక్షుల్లాగే బయల్దేరాలి.. పడుక్కుంటే ఎలాగా?

రాజు, ఆఫ్రికా ఖండంలో బోట్స్వానా లో మైనింగ్ ఇంజనీర్. డిబీర్ కంపనీ వాళ్ళ డెబ్స్వానా వజ్రపు గనుల్లో, అతని ప్రతిభ గురించి విని పిలిచి ఉద్యోగం ఇచ్చారు.

ఆ దేశ రాజధాని గాబరోన్‌కి నూట అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న జ్వానెంగ్ గనుల్లో ఉద్యోగం. అక్కడే కంపనీ వారిచ్చిన గెస్ట్‌హౌస్‌లో నివాసం. ముందంతా లాన్లు, క్రోటన్లు, పూల మొక్కలు ఉన్నా... రాజు గదికి వెనుక అంతా అడివిలా ఉంటుంది. అందులో రకరకాల చెట్లు తుప్పలు అడ్డదిడ్డంగా పెరిగున్నాయి. అక్కడే చిన్న రావిచెట్టులాంటి చెట్లు, వాటికింద ఒక దిగుడుబావి.. సహజంగా ఉంటుందని అలాగే వదిలేసినట్లున్నారు.

ఆ దిగుడుబావిలోనే తేనె పక్షుల నివాసం. సన్నగా అల్లిన పొడుగు బుట్టల్లాంటిగూళ్ళు... ఆ గూళ్ళు చూస్తుంటే రాజుకి ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. దట్టంగా.. మధ్య మధ్య సందులతో ఎంతో అందంగా ఉంటాయి. ఆడ, మొగ పక్షులూ రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ.. అల్లేస్తాయి. ఎంతో అందంగా ఉన్న ఆగూళ్ళు ఎండ రాకుండా.. గాలితగిలేలా.. లోపల చల్లగా ఉంచుతాయి.. ఏసీ ఎందుకూ పనికి రాదు.

పొద్దున్నే చుట్టుప్రక్కల ఉన్న ముంగిసల్ని తేనెపట్ల దగ్గరికి తమ అరుపుల్తో తీసుకెళ్ళి, అవి ఖాళీ చేశాక మిగిలిన పట్లనించి నోటినిండా తేనె నింపుకుంటాయి. కొన్ని రకాల పక్షులు అత్యంత వేగంతో లేచి, పూలమీద వాల్తాయి.. పువ్వులకి ఏమాత్రం దెబ్బ తగలకుండా, తేనె సేకరిస్తాయి. తేనె తాగేసి గూటికొచ్చి కిచకిచలాడ్తూ గూట్లోకీ చెట్లమీదికి విహరిస్తుంటాయి.



రాజు తయారయి.. తోళ్ళల్లాంటి కార్న్‌ఫ్లేక్స్‌ని చల్లని పాలలో వేసుకుని తినేశాడు. రెండ్రోజుల తర్వాత తినబోయే వేడివేడి ఇడ్లీ, సాంబార్ తల్చుకుంటూ. గెస్ట్‌హౌస్ లోంచి బైటికి రాగానే, తళతళా మెరిసే ఎర్ర టోయోటా కారు తలుపుతీసి పట్టుకున్నాడు డ్రైవర్ రహీం.

రహీంని తమ ఊరినించి, తనే రికమెండ్ చేసి తీసుకొచ్చాడు రాజు. రహీంకి రెండేళ్ళ క్రితం పెళ్ళయింది. తండ్రికి ఏ మందులకీ తగ్గని జబ్బు.. తల్లి లోకం తెలయని అమాయకురాలు. తల్లిదండ్రుల్నీ, ఇద్దరు చెల్లెళ్ళనీ, చిన్నతమ్ముడ్నీ భార్య సబీనాకి అప్పగించి, రాజు వెంట వచ్చేశాడు. సబీనా బాగా చదువుకుంది... అందుకే నిశ్చింతగా, వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకుండా వచ్చాడు రహీం.

రాజు, రహీం ఇద్దరూ తాము తినడానికీ, ఉండడానికీ మాత్రం, ఉంచుకుని మిగిలిన డబ్బు అంతా ఇళ్ళకి పంపిస్తూ ఉంటారు.


రహీం మొహం కూడా వెలిగిపోతోంది ఆనందంతో, అతను కూడా తన వాళ్ళ దగ్గిరికి వెళ్తున్నాడు మరి. రాజు కూర్చోగానే ఉత్సాహంగా తలుపు వేసి, నాలుగంగల్లో తన సీట్లోకి దూకి కారు సర్రున ముందుకి పోనిచ్చాడు. పదిహేను కీలోమీటర్ల దూరంలో ఉంది గని. కాలనీ వదిలి కొంతదూరం వెళ్ళగానే చెట్లు, పచ్చదనం మాయం అయి, రాళ్ళు, రప్పలతో నిండిన గుట్టలు.. కళ్ళల్లోకి సూర్య కిరణాలవేడిని గుచ్చుకునేలా ప్రతిబింబిస్తూ మొదలవుతాయి.

మధ్యలో ఉండే చిన్న తుప్పల మధ్య నడుచుకుంటూ వెళ్ళే ఆఫ్రికన్లు, సగం ఆచ్ఛాదనతో ఎండలో నల్లగా నిగనిగా మెరుస్తుంటారు. గని దగ్గరకి వస్తుంటే అందులో పనిచేసే పనివారు.. వేగంగా వెళ్తుంటారు, చెమటలు ధారలుగా కారిపోతుండగా.

గనిదగ్గరికి వెళ్ళాక రాజు కూడా అంతే.. రక్షణకి పెట్టుకున్న

హేట్‌లోంచి ఒంట్లో ఉన్న రక్తమంతా చెమటగా మారిపోతున్నట్లు, అలా కారుతూనే ఉంటుంది. అతను భారతదేశంలో పనిచేసిన మణుగూరు బొగ్గుగనులకీ, ఇప్పుడు చేస్తున్న వజ్రపు గనులకీ తవ్వడంలో, ముడిసరుకు వెలిదియ్యడంలో ఏమీ తేడాలేదు. కాకపోతే అక్కడ తవ్వే బొగ్గు తక్షణం మంటకింద మారి గాల్లోకి కలిసిపోయి శక్తి ఇస్తే... ఇక్కడ తవ్వేబొగ్గు తరతరాలుగా నిలిచి కనువిందు కలిగిస్తుంది... భూమిలో ఉండే వత్తిడి, పీడనంలలో తేడా ఎటువంటి మార్పుల్ని తెస్తుందో.. సృష్టి లోని అద్భుతాల్లో అదొక్కటి.

భాగ్యవంతులు వజ్రాలు ధరిస్తే.. బీదవాళ్లు తెచ్చుకున్న సరుకులతో ఆహారాన్ని బొగ్గులతో తయారుచేసుకుని.. ఏపూట కాపూట గడుపుతారు. ఇద్దరికీ బొగ్గు కావాలి, వేర్వేరు రూపాల్లో.



'కానీ ఐశ్వర్య చిహ్నమైన వజ్రం పండే చోట... ఎందుకు ప్రజలు అంతబీదగా వెనుకబడి ఉంటారు? క్షణ క్షణం ఎయిడ్స్ భయంతో.. లేదు.. ఆ అమాయకులకి ఆ సంగతి కూడా తెలియదు. తనకేహాస్పిటల్‌లో ఇంజక్షన్ తీసుకోవాలన్నా భయమే!' తల విదిలించి కారుదిగాడు రాజు. తన విధి నిర్వర్తించడానికి.

***

రాజు జోన్స్‌బర్గ్ నుంచి హైద్రాబాద్ వెళ్ళే విమానంలో వెనక్కి వాలి పడుకున్నాడు ఫస్ట్‌క్లాస్‌లో. అదే విమానంలో రహీం కూడా.. ఇకానమీలో, కూర్చునే కునుకుతున్నాడు.

తల గట్టిగా నొక్కుకున్నాడు రాజు.

"కెనై హెల్ప్ యు సర్.." ఎయిర్ హోస్టెస్ వచ్చేసింది పిలిచినట్టు. "యా! కాఫీ ప్లీజు.." అంటూ జేబులోంచి టాబ్లెట్ తీసి వేసుకున్నాడు. రాత్రంతా ఒకటే టెన్షన్. జ్వానెంగ్ నించి బయల్దేరడం ఆలశ్యమయింది. దాంతో గాబరోన్‌లో జోన్స్‌బర్గ్ విమానం, ఎయిర్‌పోర్ట్‌లోకి అడుగు పెడ్తుండగానే టాటా చెప్తూ క్లాస్‌లో ఖాళీ ఉన్నా రహీం కోసం ఉండిపోయాడు.

టికెట్లు కన్ఫర్మ్ అయేవరకూ తిరుగుతూనే ఉన్నారు ఇద్దరూ! శాకాహారి అయిన రాజుకి ఏమీ దొరకలేదు తినడానికి.. చాక్లెట్ పాలు తప్ప. దాంతో విపరీతమైన నీరసం.. తలనొప్పి. ఫస్ట్‌క్లాస్ కనుక కూర్చోగానే వెజిటబుల్ శాండ్‌విచ్ చెప్తే తెచ్చిచ్చారు. తిన్నాక నీరసం తగ్గింది కానీ... తలనొప్పి మాత్రం..

"సర్.. కాఫీ!"

***

హైద్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోంచి బైటికి వచ్చి ఆతృతగా చూశాడు రాజు. ఎవ్వరూ కనిపించలేదు.. నిరుత్సాహంగా తన సామన్లున్న బండి తోసుకుంటూ ముందుకి నడిచాడు.

"సార్! బస్సెక్కి సిటీ కెళ్లిపోదాం.. అక్కడ్నుంచి ఆటో తీస్కోవచ్చు." రహీం సలహా విని బస్సెక్కి కూర్చున్నాడు.. టాక్సీ అంటే.. అదో వెయ్యి రూపాయలు. ఎందుకు దండగ.

బస్ దిగాక, రహీం చార్మినార్ బస్ ఎక్కుతే, రాజు ఆటో చేసుకుని జుబిలీహిల్స్‌కి బయల్దేరాడు.

ఎపార్ట్‌మెంట్ దగ్గిర ఆటో ఆపి, గేటు చప్పుడు చేశాడు. పొద్దున్న నాలుగయింది. కునికిపాట్లు పడుతున్న వాచ్‌మేన్ విసుక్కుంటూ గేటు దగ్గిరికి వచ్చి అడిగాడు.. "కౌనై."

"టూజిరోటూ.." నేనే ఆ ఫ్లాట్ ఓనర్ని అని రాజు చెప్దామనుకుంటూ ఉండగానే "ఏక్ మినట్." అంటూ మాయం అయిపోయాడు.

అన్ని వేలమైళ్ళు.. మూడురోజులు, నిద్ర.. సరి అయిన ఆహారం లేకుండా ప్రయాణం చేసి వచ్చిన రాజుకి చిర్రెత్తుకొచ్చింది. తను వస్తున్నాడని తెలుసు కదా.. కనీసం లీల అయినా లేచి కిందికి వచ్చి చూడచ్చు కదా! జోన్స్ బర్గ్ నించి ఫోన్ చేశాడు కూడా...

ఐదు సుదీర్ఘ నిముషాలయ్యాక, లీల మెట్లు దిగి వచ్చింది ఆయాసపడ్తూ.. అంతలోకే వాచ్‌మన్ గేటు తీశాడు.. లీల చెప్పినట్లుంది.

"కరంట్ ఇప్పుడే పోయినట్లుంది... వాచ్‌మన్ జెన రేటర్ వెయ్యి.. బాగున్నారా.. ప్రయాణం బాగా జరి గిందా.. బాగా చిక్కిపోయినట్లున్నారే.." వాచ్‌మన్‌తో రాజుతో ఒకేసారి మాట్లాడుతూ ఒక సూట్‌కేస్ దొర్లిస్తూ లిఫ్ట్ దగ్గరికి నడిచింది లీల. రాజుకి ఉక్కగా చిరాగ్గా ఉంది.

ఎలాగైతేనేం.. మొత్తానికి హోం.. స్వీట్‌హోంకి వచ్చి పడ్డాడు రాజు.

"పిల్లలు నిద్రపోతున్నారా?" అప్పటికప్పుడు నిద్ర లేపి ముద్దులు పెట్టేయాలనిపించింది.

"మరి.. ఈ టైమ్‌లో.. మీరుకూడా పడుక్కోండి కాసేపు.. వాళ్ళు లేచాక లేపుతాను. నిన్నంతా ఎదురు చూశాం.." లీల ఆవలిస్తూ మంచం మీదికి చేరి వెంటనే నిద్రలోకి వెళ్ళిపోయింది.

రాజుకి కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగాలని ఉంది, అలసటగా ఉన్నాకూడా, ఇల్లంతా తిరిగి, ఏమేం వుడ్‌వర్క్ చేయించిందో.. ఫ్లాట్స్‌లో అందరూ ఎట్లా ఉంటారూ.. అన్నీ అడగాలని ఉంది. గుర్రు పెడ్తున్న భార్యని చూస్తూ, మంచంమీద దిండునాను కుని కూర్చున్నాడు.

"ఎంత అలిసిపోయిందో పాపం.. ఒక్కతే అన్ని పనులు చూసుకోవాలి కదా!.." ప్రేమ పొంగుకొచ్చి ఒక్కసారి ముంగురులు సవరించాడు. కొంచెం కూడా కదలిక లేదు.. పోనీ ఇల్లంతా చూద్దామా.. అందరూ లేచిపోతారేమో! కిటికీకి కట్టిన ఖరీదైన తెరలకేసి చూస్తూ నిముషాలు లెక్కపెట్టసాగాడు.

రాజు ఆఫ్రికా వెళ్ళేముందు ఈ ఫ్లాట్ బుక్ చేశాడు. కడ్తున్నప్పుడు తప్ప ఇంట్లోకి వచ్చాక ఇదే చూడ్డం. గృహప్రవేశం కూడా తల్లిదండ్రులని చేసెయ్యమ న్నాడు. అర్నెల్లు ఆగుతే నెలకి పదివేలు అద్దె ఇచ్చుకో వాలి కదా! లోపలి ఫిట్టింగ్స్, కర్రపని.. అంతా ఫోటోలు ఈ-మెయిల్లో చూడ్డమే.. మొత్తం కోటి పైన అయింది. తను ఇంకో మూడేళ్ళైనా గనుల్లో కష్టపడ్తే కానీ అప్పు తీరి, కొంత దాచుకోడానికి కుదరదు.

"ట్రింగ్.. ట్రింగ్.." కాలింగ్ బెల్. రాజు ఒక్క ఉదుట్న మంచం మీంచి దూకినట్టుగా దిగి తలుపు తీశాడు.... పాలవాడైతే ఎంచక్కా కాఫీ తాగచ్చు..

"ఎలా ఉన్నావురా.. ఎన్నాళ్ళైందిరా.. ఎంత చిక్కి పోయావురా నాన్నా!" తల్లిని చూడగానే అంత మొహం అయింది... వెనుకే తండ్రి... ఆ వెనుకే అత్త గారూ, మామగారు.. మరదలూ.. అంతా బిలబిలా వచ్చేశారు. లోపల్నుంచి లీల కూడా లేచి ఆవలిస్తూ వచ్చి అందర్నీ పలుకరించింది. ఇల్లంతా లైట్లు వేసే శారు. సందడికి పిల్లలు కూడా లేచిపోయారు.

చిట్టి, బుజ్జి... ఇద్దరూ అంత దూరంనించే నాన్నని కళ్ళార్పకుండా చూడసాగారు బిడియంగా. లీల అందరికీ కాఫీలు కలుపుకొచ్చింది. కాఫీ తాగి ఇల్లంతా చూశాడు రాజు. చాలా బాగుంది.


"అనుకున్నదానికంటే ఇంకో రెండులక్షలెక్కువే అయింది.. అయినా.. మళ్ళీమళ్ళీ చేయిస్తామా అని చేయించేశాను." డ్రాయింగ్‌రూంలో ఉన్న చాందిలీర్ చూపిస్తూ అంది లీల.

పొద్దున్నే పనిమనిషి, వంటమనిషి, కారు డ్రైవర్ అందరూ వచ్చి ఎవరి పనులు వాళ్ళు చేసుకుపోతు న్నారు. లీల అందర్నీ అజమాయిషీ చేస్తూ అటూ ఇటూ తిరుగుతోంది. పిల్లలు తయారయి, బిడియంగా నాన్నకి టాటా చెప్పి స్కూలుకి వెళ్ళిపోయారు.

"అమ్మాయి ఒక్కతీ అన్ని పనులూ చూసుకోలేక నానా అవస్థా పడుతోందిరా.. ఇంకా ఎంతకాలం ఇలాగా.." ఆవిర్లు కక్కుతున్న ఇడ్లీలు వేస్తూ అంది రాజు వాళ్ళమ్మ.

అత్తగారుకూడా అదే ప్రశ్న కళ్ళతో వేస్తుంటే, ఏం చెప్పాలో తెలీక రాజు లీల కేసి చూశాడు. తనకి మాత్రం సరదానా.. ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయమేగా! లీల ఏం మాట్లాడకుండా కాఫీ కలుపుతోంది. ఇరువైపుల పెద్దవాళ్లూ అంతదూరం వెళ్ళద్దని చెప్తూనే ఉన్నారు...

"మంచి క్వార్టర్స్... పిల్లలకి మంచి చదువులూ..




వదులుకుని అంత దూరం వెళ్ళి ఏం ఉద్ధరిస్తావూ.. మాకేం ఇవ్వక్కర్లేదు కదా!" తండ్రి ఉత్తరానికి జవాబు రాయలేదు.

ఒకసారి తాము కూర్చున్న డైనింగ్ హాల్ చూశాడు రాజు.. జన్మలో ఇట్లాంటి ఫ్లాట్, ఈ లొకాలి టీలో కొనగలడా!

***

రాజు కున్న నెల్లాళ్ళ సెలవూ ఇట్టే అయిపోయింది. అత్తమామలు పదిరోజులుండి వెళ్తే, తల్లీ, తండ్రీ రాజు ఉన్నన్ని రోజులూ అక్కడే ఉన్నారు..మళ్ళీ ఎన్నాళ్ళకి కని పిస్తాడో, అంటూ. అమ్మా, నాన్నా అయినా కూడా.. తనూ భార్యా ఏకాంతంగా, సరదాగా గడపడానికి వీల్లే కపోయిందని రాజుకి మనసులో బాధగా ఉంది.

ఊళ్ళో ఉన్న బంధువులూ, స్నేహితులూ.. రోజూ ఒకళ్ళ తరువాత ఒకళ్ళు... నిజమే, అందరికీ తనని చూడాలని ఉంటుంది.. తనక్కూడా. కానీ! రెండు సంవత్సరాలు ఎంతో ఆత్రుతతో ఎదురుచూసిన ఈ సమయం.. పిల్లలతో మనసారా మాట్లాడ్డానికి కుద రడం లేదు.

ఆఖరికి భార్యతో.. కూడా... అంతా నిరుత్సా హంగా సాగిపోతోంది.

ఈ పెద్దవాళ్ళు ఎందుకు అర్థం చేసుకోరో! ఏడాది విరహం.. పగలంతా బ్యాంక్ పనులూ.. ఇంటికి కావల సిన కాగితాలూ.. అప్పులు, సరి చూసుకోడం, సింగరేణి కాలరీస్ నించి రావలసిన బకాయిలకోసం తిరగడం..

పోనీ ఎక్కడికైనా వెళ్దామంటే... పిల్లలకి స్కూల్. వాళ్ళని వదిలివెళ్దామంటే, తల్లి చూసుకోలేనంటుంది.

పిల్లలు కూడా రాజు ఊహించినట్లు ఒళ్లో కూర్చోడం, భుజాలమీద ఎక్కడం లాంటివి మానేశారు. దూరంగా ఉండడంతో చనువు తగ్గినట్లనిపించింది. ఏది కావల్సినా, అమ్మా! అనే పిలుస్తారు. తను వెళ్ళినా కూడా.. నీకేం తెలుసు.. అన్నట్లు చూస్తారు, రాజు ఎంత దగ్గరికి తీద్దా మని ప్రయత్నం చేసినా కూడా!

ఎంత చక్కగా ఉండేవారు నలుగురూ! ఎప్పుడైనా పండగలకి కలవడం తప్ప ఎవరూ వచ్చేవారు కాదు.. ఆదివారం వచ్చిందంటే, క్లబ్‌లో ఏదో ప్రోగ్రాం ఉండేది. పోష్‌గా లేకపోతేనేం.. క్వార్టర్‌లో చెట్లు, పూలతోట.. ఇంటికి రాగానే అందులో కూర్చుని టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటుంటే.. తల్చుకుంటే రాజుకి అంతా అయోమయంగా అనిపించింది.

ఎటువంటి నిర్ణయం తీసుకున్నాం?

***

"అవును రాజూ! మంచి నిర్ణయం అని నాకు తోచ ట్లేదు.." ఎదిగిన కొడుకు ఏమైనా అనుకుంటాడేమో నని మెల్లిగా అన్నాడు రాజు తండ్రి..."పిల్లలకి తండ్రి ప్రేమా, గైడెన్స్ లేకుండా చేశావు. ఆడపనీ, మొగపనీ చేసుకోలేక అమ్మాయి అవస్థ పడుతోంది. నీకేం నువ్వు బాగానే ఉన్నావు, హాయిగా ఏదీ పట్టించుకోకుండా!"

నిలదీస్తున్న కన్నతండ్రిని నిర్వేదంగా చూశాడు రాజు. తను హాయిగా ఉన్నాడా?

పగలంతా ఎర్రగా కాల్చే ఎండలో.. రక్తం సలసలా మరిగిపోతుందా అన్నట్లనిపిస్తుంటే పిల్లల్నీ, భార్యనీ తల్చుకుంటూ.. రుచీపచీలేని తిండి తింటూ... ఇంటికి వస్తే ఒంటరితనం అని ఇంకొంచెంసేపు, దుమ్మూ ధూళీ ఉన్న గనిలోనే.. కనీసం మనుషులు కనిపిస్తారని గడుపుతూ.. అవునూ! ఎవరిది తప్పు?

''లీలా! నేను వెళ్లిన వెంటనే రిజైన్‌చేసి వచ్చేస్తాను..'' ఏకాంతంలో అన్నాడొకసారి.

కౌగిలి విడిపించుకుని చటుక్కున దూరంగా జరిగి తన మొహంలోకి బెదురుగా చూసింది.

''వచ్చేసి ఏం చేస్తారు?''

నిజమే! ఏం చెయ్యాలి? మళ్ళీ పాత ఉద్యోగం రాదు. సెలవు పెట్టి వెళ్ళకుండా రిజైన్ చేసేశాడు, యాజమాన్యం అనుమతి ఇవ్వకపోతే. ఎదిగే పిల్లలు.. ఖర్చులు... ఎలాగ! రాజుకి బుర్ర స్తబ్దుగా అయిపోయింది.. అటు వైపుకి తిరిగి పడుక్కున్నాడు.

''పోనీ ఫ్లాట్ అమ్మేద్దాం. ఇప్పుడు ధరలు పెరిగాయికదా.. అప్పు తీరిపోగా, చిన్న ఫ్లాట్ కొనుక్కుని నాకు మళ్ళీ ఏదైనా దొరికే వరకు కాలక్షేపం చెయ్యచ్చు.'' సెలవు అయిపోయి వెళ్ళిపోయేరోజు పొద్దున్నే అన్నాడు భార్యతో.. అంతకు ముందు రాత్రి నించే కడుపులో గాభరాగా ఉంది రాజుకి. మళ్ళీ నాలుగ్గోడలూ తనూ.. లేదా కొండలూ, బండలూ!

లీల మొహం మ్లానమైపోయింది. పెదవులు వణకసాగాయి.. కళ్ళలోంచి నీళ్ళు రాలడానికి సిద్ధంగా ఉన్నాయి.

''అదేంటి రాజూ! మనం అన్నీ ఆలోచించుకునే కదా నిర్ణయం తీసుకున్నాం. ఇంత కష్టపడి ఇల్లు కొనుక్కుని.. ఇన్ని చేయించుకుని, ఇప్పుడు మళ్ళీ ఉప్పుకి పప్పుకి వెతుక్కుంటూ.. నా వల్లకాదు. ఒక నాలుగేళ్ళు ఎంతలో గడిచిపోతాయి!'' రాజు ఏమీ మాట్లాడలేదు యింకా నాలుగేళ్ళా... నలభై ఏళ్ళా... అప్పటికి జీవితంలో ఏం మిగులుతుంది?

''నాన్నా! నాకు స్కూల్లో ఈ ప్రైజ్ వచ్చింది...'' అనే కొడుకూ..

''నాన్నా! నేను ఫస్ట్ రేంక్ వచ్చాను..'' అని మెరిసే కళ్ళతో చెప్పే కూతురూ.., వాళ్ళ పరిష్వంగాలూ... అన్నీ అప్పుడు వస్తాయా!

''అది కాదు లీలా...''

''ఇంకేం చెప్పద్దు రాజూ... ప్లీజ్! ఎంతో కష్టపడి అమర్చుకున్న ఈ ఇంటిని అమ్మద్దు. కావాలంటే నేను వస్తాగా మధ్యలో...''

***

వెబ్ కామ్‌లో పిల్లల్ని చూస్తూ.. వాళ్ళ మాటలు వింటూ, భార్యకి సలహాలిస్తూ ఇంకొక సంవత్సరం గడిపాడు రాజు.

''మీరు సెలవు తీసుకోకుండా ఉంటే రెట్టింపు జీతం ఇస్తాం ఆ నెలంతా...'' యాజమాన్యం పంపించిన కాగితం చూస్తూ ఆలోచనలో పడ్డాడు రాజు.

''సార్! నేను ఛుట్టీ తీసుకోవట్లేదు సాబ్.. అంటే.. మీరు కూడా తీసుకోకపోతే..'' అటువంటి కాగితమే తీసుకుని పరుగెత్తుకునొచ్చి ఆగిపోయాడు రహీం. రాజు వెళ్తే అతనికి పనుండదు.. ఛుట్టీ తీసుకోవలసిందే.

''నేనూ అదే ఆలోచిస్తున్నా రహీం.. ఏం చెయ్యాలా అనీ..''

''ఈ సాల్‌కూడా ఎట్టనో గడిపేద్దాం సాబ్!'' ఆశగా అన్నాడు రహీం. తల్లి జబ్బుకి ఏదో ఖరీదైన మందు కనుక్కున్నారుట.

లీలకి ఫోన్ చేసి మాట్లాడాడు రాజు.

''వావ్... ఎంత మంచి వార్త చెప్పారు రాజూ! పిల్లల్ని హాస్టల్లో చేర్పిద్దామనుకుంటున్నా.. అక్కడైతే బాగా చదివిస్తారని. డిపాజిట్‌కి ఎట్లాగా అని చూస్తుంటే.. ఇది చెప్పారు. ఐ యామ్ వెరీ హేపీ..'' అత్యంత ఉత్సాహంగా వినిపిస్తున్న లీల కంఠం విని ఫోన్ పెట్టేశాడు రాజు.

హాస్టలెందుకు.. నువ్వే చదివించచ్చుకదా.. పిల్లలకి తల్లి కూడా దగ్గర లేకపోతే ఎల్లాగా.. ఎన్నో అడగాలనుకున్నవాడు.. ఏమీ అడక్కుండానే పెట్టేశాడు.

***

నాలుగేళ్ళనుకున్నది ఎనిమిదేళ్ళయింది. మధ్యలో రాజు, రహీం రెండు సార్లు మాత్రం ఇండియా వెళ్ళొచ్చారు. మూడు సార్లు లీల వచ్చింది. ఎండలకీ, దుమ్ముకీ తట్టుకోలేక.. ఎవరూ మాట్లాడే వాళ్ళు లేకా..., ఒక నెలలోనే వెళ్ళిపోయింది.

ఎలాగయితేనేం.. పదేళ్ళతరువాత, ఒంటరి జీవితానికి స్వస్తి చెప్పి, జోన్స్‌బర్గ్‌లో ఎన్నో వస్తువులు కొనుక్కుని ఇంటికొచ్చారు రాజూ, రహీం. గనుల్లో పని తగ్గిపోయిందని కంపెనీ వాళ్ళు బోలెడు రాయితీలిచ్చి పంపించేశారు.


మణుగూర్‌లో ఉన్నప్పుడు రోజూ బాడ్మింటన్ ఆడేవారు. ఇంటి చుట్టూ ఉన్న తోటలో తిరుగుతూ ఎంతో చురుకుగా ఉండేది లీల..
ఈ ఎపార్ట్మెంట్‌లో నాలుగ్గోడల మధ్య... ఒక్కతే... ఎందుకిలా?
పొద్దున్నే కాలింగ్ బెల్ విని ఉలిక్కి పడ్డాడు రాజు.. పాలవాడే అయుంటాడు. తల్లీ, తండ్రీ ఒక నెల తేడాలో ఒకర్ని వదిలి ఒకరు ఉండలేమన్నట్లుగా వెళ్ళిపోయారు స్వర్గానికి. అత్తగారు, మామగారూ.. ప్రయాణం చెయ్యలేమంటున్నారు.
ఎప్పుడూ రాజు కోరుకునే ఏకాంతం.. కానీ ఇప్పుడు తన ఇంట్లో తనే పరాయివాడిలా ఉన్నాడు.


ఎంతో ఆశతో, ఉత్సాహంతో తను ఎన్నో కలలుకని కొనుక్కున్న గూటికి చేరాడు రాజు.

లీల కిందికి, గేటు దగ్గరికి కూడా రాలేదు. ఈ సారి వాచ్‌మన్ అడ్డు చెప్పలేదు. లిఫ్ట్ కూడా పనిచేసింది.

చక్కటి డిజైన్‌తో, తళతళా మెరుస్తున్న టేకు తలుపు దగ్గర ఆగి బెల్ కొట్టాడు రాజు. ఇంచుమించు ఐదునిముషాల తర్వాత తలుపు తీసింది లీల.

''అప్పుడే వచ్చేశారే.. మీ ఫ్లైట్ రేపనుకున్నా...'' నవ్వుతూ పలుకరించి, కుంటుతూ వెనక్కి వెళ్తున్న భార్యని చూసి నిట్టూర్చాడు రాజు.

ఇంట్లో ప్రతీ పనికీ పనివాళ్ళు.. పిల్లల్ని చూసుకుని, వాళ్ళకి అమర్చే పని కూడా లేదు. ఇద్దరూ దూరంగా ఇంజనీరింగ్ చదువుతున్నారు. క్లబ్బుకి వెళ్ళి కూర్చుని పేకాడుతూ, విపరీతంగా లావయిపోయి, కీళ్ళ నొప్పుల్తో ఏ పనీ చేసుకోలేక, కంటి కింద నల్లని వలయాలు, మొహమంతా పిగ్మెంటేషన్‌తో మచ్చలు.. నలభైయేళ్ళకే యాభై లా ఉంది. పదేళ్ళ క్రితం ఉన్నట్లుగా ఊహించలేదు కానీ.. తాము ఇద్దరూ ఒక దగ్గర ఉంటే ఎలా ఉండేదో అనుకున్నాడు రాజు.

మణుగూర్‌లో ఉన్నప్పుడు రోజూ బాడ్మింటన్ ఆడేవారు. ఇంటి చుట్టూ ఉన్న తోటలో తిరుగుతూ ఎంతో చురుకుగా ఉండేది లీల..

ఈ ఎపార్ట్మెంట్‌లో నాలుగ్గోడల మధ్య... ఒక్కతే... ఎందుకిలా?

పొద్దున్నే కాలింగ్ బెల్ విని ఉలిక్కి పడ్డాడు రాజు.. పాలవాడే అయుంటాడు. తల్లీ, తండ్రీ ఒక నెల తేడాలో ఒకర్ని వదిలి ఒకరు ఉండలేమన్నట్లుగా వెళ్ళిపోయారు స్వర్గానికి. అత్తగారు, మామగారూ.. ప్రయాణం చెయ్యలేమంటున్నారు.

ఎప్పుడూ రాజు కోరుకునే ఏకాంతం.. కానీ ఇప్పుడు తన ఇంట్లో తనే పరాయివాడిలా ఉన్నాడు.

***

ఇంకో నాలుగేళ్ళు గడిచాయి. పిల్లలు పెళ్ళిళ్ళు చేసుకుని ఎవరి జీవితాలు వాళ్ళు గడుపుతున్నారు. ఎప్పుడో... ఏ రెండు మూడేళ్ళకో వచ్చి వారం రోజులుండి వెళ్ళి పోతున్నారు.

అంత పెద్ద ఇంట్లో, రాజు, లీల.. బోలెడంత సామాను.. అంత కష్టపడి అమర్చుకున్న ఇంద్రభవనం లాంటి ఇంట్లో, రాజు భార్యా పిల్లలతో గడిపింది చాలా తక్కువ సమయం.

ఒక రోజు పొద్దున్నే రాజు కిటికీ లోంచి సూర్యుడ్ని చూస్తుంటే, జ్వానెంగ్‌లో తేనె పక్షులు, వాటి గూళ్ళు గుర్తుకొచ్చాయి. తమలాగే ఆ పక్షులు కూడా... పదిలంగా అల్లుకున్న గూట్లో తమ పిల్లల్ని పెంచవు. పెట్టిన గుడ్లని వేరే పక్షుల గూళ్ళలో వదిలేస్తాయి. వాటంతట అవే పెరగాల్సిందే.

జీవితంలో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాల్సిన సమయంలో.. ఒంటరిగా పరుగుల్తో గడిచిపోయింది. గూటిలో తామిద్దరే.. గాఢంగా నిట్టూరుస్తూ లేచాడు రాజు... కాలింగ్‌బెల్ మోత విని.

''గుడ్‌మార్నింగ్ సాబ్...''

రహీంని మాటని బట్టి గుర్తు పట్టాడు రాజు. బాగా చిక్కిపోయి, గడ్డం పెరిగి... కళ్ళు లోతుకి వెళ్ళిపోయి.. నాలుగేళ్ళయింది చూసి.

''ఇదేంటి రహీం.. ఏమయింది?'' సోఫాలో కూర్చోపెట్టి అడిగాడు రాజు.

''ఏం కాలేదు సాబ్.. మీకు డ్రైవర్ కావాలేమో అడుగుదామని వచ్చిన. నేను పంపిన పైసల్ నా బీబీ ఇంట్లో ఏం ఇవ్వలే.. అన్నీ తీస్కోని, వేరే వాన్తో గయా సాబ్... అందరం రోడ్ మీదికి వచ్చినం. మీకేం సాబ్.. పిల్లలు మంచిగ సెటిల్ అయిన్రు. మంచి ఇల్లు.. ''మా''జీ మంచిగ చూసుకున్నరు..'' రెండు చేతుల్లో మొహం దాచుకున్నాడు.

ముంగిసలకి దారి చూపించే తేనె పక్షిలా కనిపించాడు రహీం, రాజుకి. కాకపోతే.. ఆ పక్షి ముంగిసని తేనె దగ్గరికి తీసుకెళ్తుంది, రహీం భార్యని ఇంకో మొగుడి దగ్గిరికి వెళ్ళేలా చేశాడు.. దూరంగా ఉండి. తనకే నయం.. కనీసం గూడేనా మిగిలింది.

*


చిరునామా:
మంథా భానుమతి
**102, పిన్నాకిల్ ప్రైడ్, ఉమానగర్,**
**బేగంపేట, హైదరాబాద్ - 500 016.**
**ఫోన్: 23414363**